బాలమిత్ర , సెప్టెంబరు – 1997, పుట : 53-55, జి. రామలక్ష్మి - హైదరాబాదు

## వృద్ధాప్యం

శాంతమ్మ వంటి యింట్లో వంట కానిస్తూనే గడికోసారి వీధిలోకి రావటం, ఆదుర్దాగా వచ్చిపోయే ఆటోల వైపు చూడటం, అవి ఆగకుండా అటో యిటో వెళ్ళిపోగానే విసుక్కుంటూ, తిట్టుకుంటూ లోపలికి రావటం, మళ్ళీ గరిట చేతబుచ్చుకుని పులుసో, కూరో కలియతిప్పటం ఇలా చేస్తోంది. ఒకవిధంగా కాలుగాలిన పిల్లిలా తిరుగుతోందనే అనొచ్చు.

అది గమనిస్తూనే ఉన్నాడు రాఘువయ్య. భార్య ఆదుర్దాకి నవ్వుకున్నాడు.

"నా ఆత్రుత మీకు నవ్వులాటగానే వుంటుంది. తల్లికున్న తపన తండ్రికెందుకు ఉంటుంది." మూతి మూడు వంకర్లు తిప్పుకుంటూ రాఘువయ్యని చూస్తూ అంది.

"అదికాదే పిచ్చిదానా! నీ పిల్లలు ఎప్పుడెప్పుడు వస్తారా, ఎప్పుడెప్పుడు కబుర్లు చెప్పేసుకుని, దీపావళి పండగ ఎంత ఘనంగా జరిపేసుకుందామా అన్న తపనతో, అసలు రాత్రి నిద్రపోక మూడు గంటల నుంచే పని ప్రారంభించేసావాయె. ఇప్పుడు వంట కూడా అయిపోవచ్చినా యింకా టైము ఏడుగంటలే అయింది వాళ్ళు వచ్చేసరికి పది, పదకొండుగంటలవుతుంది. వాళ్ళు ఆ బెంగుళూరు నుంచి బస్టాండ్‌కి రావాలా? అక్కడనుంచీ మళ్ళీ ఆటో ఎక్కి, ఇంటికి వచ్చేసరికి ఎంతకాదన్నా ఆ టైము అవక చస్తుందా? కాబట్టి తాపీగా పనికానియ్" అన్నాడు రాఘువయ్య.

శాంతమ్మకు భర్త మాటలు చెవికెక్కితేనా? ఆమె ధ్యాసంతా పిల్లల రాకమీదే.

కొడుకులిద్దరూ, కోడళ్ళిద్దరూ, కూతురు, అల్లుడు వారి సంతానాలు తలకో ఇద్దరు చొప్పున మొత్తం ముగ్గురు మనవలు, ముగ్గురు మనవరాళ్ళు అంతా కలిపి ఒకేసారి రావటంతో ఇల్లు కళకళలాడిపోతోంది. శాంతమ్మ ఆనందానికి అవధులు లేవు.

అందరూ భోజనాలు ముగించారు. పిల్లలంతా బయటకుచేరి టపాసులు ఎండబెట్టుకుంటున్నారు. మొత్తానికి దీపావళ సంబరంగా గడిచింది.

అంతా చేరి ఒకచోట సమావేశమయ్యారు. ఆ మర్నాడే ప్రయాణం.

పెద్దకొడుకు మెల్లగా అడిగాడు "ఈ నెల బాకీలు తీర్చలేదు కదూ" అంటూ.

"ఏదీ మీ ఎమ్.ఓ.లు అందనిదే" తండ్రి అన్నాడు.

"ఈ నెలలో మేము ఎలాగూ వస్తున్నాం కదా! ఎమ్.ఓ. ఎందుకు పంపడం. స్వయంగా మేమే వచ్చి అప్పులన్నీ తీర్చేసి, మిమ్మల్ని మాతోపాటు తీసుకువెళ్ళిపోవడానికి నిశ్చయించుకున్నాం" అని చిన్న కొడుకు తాపీగా అసలు విషయం చెప్పాడు.

"మేము మీతోనా! ఆ పట్నంలోనా? వద్దు బాబూ, మాకు యిక్కడే హాయిగా వుంది. మీరు వచ్చి వెళ్తుంటే మాకదేచాలు. మాకదే పదివేలు" తల్లి అంది నిదానంగా.

"మీకు బాగానే వుంటుంది. కానీ నెలనెలా మాకు వచ్చే జానెడు జీతాల్లోంచి మీకు ఎత్తి పంపాలంటే మాకే చాలా కష్టంగా వుంది. అందుకని ఇక ముందు పంపలేము, పంపటం జరగదు. వృద్ధాప్యంలో పెద్దవాళ్ళు పిల్లల దగ్గర ఉండటమే సమంజసం" పెద్దకోడలు ఎత్తిపొడుస్తూ అంది.

"అవును, మా కష్టం మీరు అర్థంచేసుకోవాలి" చిన్నకోడలి హెచ్చరింపు అది.

శాంతమ్మ, రాఘవయ్య ఒకరి మొగాలు ఒకరు చూసుకుని, కళ్ళతోనే మాట్లాడుకుని "సరే మీ యిష్టప్రకారమే కానియ్యండి" అన్నారు.

"అయితే సరే, తమ్ముడూ నువ్వు అమ్మని ఉంచుకో, నేను నాన్నని ఉంచుటుంటా. ఇద్దర్నీ ఒకేసారి ఉంచుకోటం కష్టం. ఏమంటావు?" అనడిగాడు తమ్ముణ్ని.

"అలాగే ... రేపే మన ప్రయాణం" చిన్నకొడుకు చెప్పాడు అన్నగారితో.

శాంతమ్మ బోరున ఏడ్చింది. అందరూ కంగారుపడ్డారు. "ఎందుకేడుస్తున్నావు? ఈ పల్లెటూరు వదలాలనా?" అన్నారు.

అది విని తండ్రి "మాకు పదమూడవ యేట పెళ్ళయింది. ఇప్పుడు నాకు అరవై మూడు, దానికి అరవై వచ్చాయి. అంటే మా సాహచర్యం యాభైఏళ్ళన్నమాట. ఏ ఒక్కరోజు, ఏ విషయంలోనూ ఆఖరికి పురుళ్ళ సమయంలో కూడా మీ అమ్మ నేనూ విడివడి వుండలేదు. అలాంటిది ఈ ఆఖరి మజిలీలో ఇద్దరం బ్రతికుండగానే వేరువేరుగా ఒంటరిగా బ్రతకాలంటే మావల్లకాదు ఈ వృద్ధాప్యంలో" అంటూ తనూ కళ్ళు తుడుచుకుని వాళ్ళతో ఇలా అన్నాడు.

"ఒరేయ్ పిల్లలూ ఈ వృద్ధాప్యం అనేది శాపమో, పాపమో కాదు. నిన్నటిరోజున మీ నాయనమ్మ, తాతయ్యలకు, ఇవాల్టి రోజున మాకు, రేపటి రోజున మీకు ... ఇలా వయసు మీరటం, వృద్ధాప్యం సంక్రమించటం సర్వసాధారణం. అదో శాపంలా భావిస్తూ, వృద్ధులు పిల్లల పాలిట భారం అనుకుంటే, రేపటి రోజున తమ పిల్లలూ అలాగే భావించి తమకి అదే గౌరవం, అదే మర్యాద ఇస్తారు" అన్నాడు.

"ఇంతకీ మీరనేది ఏమిటి?" పెద్దకొడుకు విసుక్కుంటూ అడిగాడు.

"మేము ఎక్కడికీ రాము. ఇక్కడే కలిసి ఉంటాం. కలో గంజో తాగి బ్రతుకుతాం. నా పెన్షన్ చాలు. ఓ రెండు గదులు అద్దెకిచ్చి ఒక గదిలోనే మేమంతా సరిపెట్టుకుంటాం. మీకెవరికీ మేము భారం కాము, కాలేము. ఈ వృద్ధాప్యంలో మాకు వియోగం కలిగించక వచ్చిన దారినే వెళ్ళండి. చూడాలని ఉన్నప్పుడు రండి. లేదంటే కొరివి పెట్టడానికే రండి" అన్నాడు రాఘవయ్య.

అంతలోనే అల్లుడు కలగజేసుకుని "మావయ్యా' అంతమాటనకండి. నాకు ఇద్దరు పిల్లలు కాదు, నలుగురున్నారని అనుకుంటా. మీ ఇద్దరినీ మా పిల్లలతో సమానంగా చూసుకుంటాం. మీరు మారు మాట్లాడక ఇద్దరూ వచ్చి సంతోషంగా మాతో ఉండండి" అన్నాడు మామగారిని ఆపేక్షగా తడుతూ.

ఆ మాటకి ఆ వృద్ధ దంపతుల కళ్ళు చెమర్చాయి. మిగతా వాళ్ళు సిగ్గుతో తలదించుకున్నారు ఇంకేం మాట్లాడాలో తెలియక.